ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అక్టోబర్ 30 శుక్రవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 21 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

FRIDAY OCTOBER 30 2026 | VOL:1 | ISSUE: 21 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM



తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కండి : సీఎం రేవంత్ రెడ్డి

2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ తెలంగాణ

పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు నాది భరోసా

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం

ఢిల్లీ, అక్టోబర్ 29 :

తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కావాలని అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలుస్తుందని, రాష్ట్రంలో పెట్టే ప్రతి పెట్టుబడికి తనది భరోసా అని సీఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సన్నాహక కార్యక్రమాన్ని ఢిల్లీలో గురువారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర మంత్రులు రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, అంతర్జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలు, అధికారులు పాల్గొన్నారు. సన్నాహక కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన విధాన నిర్ణయాలు, ప్రభుత్వ సహకారం అందించేందుకు తాను వ్యక్తిగతంగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌కు నాలుగు వందల ఏళ్ల క్రితమే ప్రపంచ నగరంగా గుర్తింపు ఉందని సీఎం తెలిపారు. ప్రపంచీకరణ అనే మాట ప్రాచుర్యంలోకి రాకముందే అనేక దేశాల నుంచి వ్యాపారులు హైదరాబాద్‌కు వచ్చి వ్యాపారాలు చేసేవారని గుర్తు చేశారు. చార్మినార్ పరిసరాల్లో ముత్యాలు, సుగంధ ద్రవ్యాలు, నఖాసీ వస్తువుల వ్యాపారం జరిగేదని గుర్తు చేశారు. నిజాం పాలనలో హైదరాబాద్‌లో అనేక చారిత్రక కట్టడాలు, అంతర్జాతీయ స్థాయి మ్యూజియాలు, టంకశాల, విమానాశ్రయం, రైల్వే వ్యవస్థ, విద్యాసంస్థలు ఏర్పాటయ్యాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్న సత్య నాదెళ్ల (మైక్రోసాఫ్ట్), అజయ్ బంగా (ప్రపంచ బ్యాంకు), శంతను నారాయణ్



(అడోబ్), ప్రేమ్ వత్స వంటి వారు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రతిభావంతులను అందించడంలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు సీఎం తెలిపారు.

రాజీవ్, పీవీ సేవలు మరువలేనివి

భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు సిద్ధమవుతున్న తరుణంలో దేశాభివృద్ధికి బాటలు వేసిన నాయకులను గుర్తు చేసుకోవాల్సిన (మిగతా 3వ పేజీలో..)

చంద్రబాబును మెచ్చుకున్న కేటీఆర్..

తెలంగాణ సర్కార్‌పై తీవ్ర విమర్శలు!

కరవు పరిస్థితులను చంద్రబాబు గొప్పగా నిర్వహించారన్న కేటీఆర్

అక్కడ లేని కరవు తెలంగాణలో ఎందుకుందని ప్రభుత్వంపై విమర్శ

కొండా సురేఖ ఏం చెప్పారో పూర్తిగా చూడలేదని వెల్లడి

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందనలు కురిపించారు. తెలంగాణలో కరవు పరిస్థితులపై స్పందిస్తూ, పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆయన ప్రశంసించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణ కంటే ఏపీలో ఎక్కువ కరవు ఉన్నప్పటికీ, చంద్రబాబు పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించారని కేటీఆర్ అన్నారు. పక్క రాష్ట్రాలైన ఏపీ, కర్ణాటకలో లేని కరవు తెలంగాణలోనే ఎందుకు వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది '30 శాతం కమీషన్ సర్కార్' అని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని కూడా తెలిపారు.ఇదే సమయంలో, గతంలో తనపై చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి కొండా సురేఖ క్షమాపణ చెప్పడంపై కేటీఆర్ స్పందించారు. 'నిజం నిలకడ మీద తేలుతుంది' అని వ్యాఖ్యానించారు. కొండా సురేఖ ఏం చెప్పారో ఇంకా పూర్తిగా చూడలేదని, ఆ వివరాలు చూశాక లీగల్ టీమ్‌తో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇటీవల ఒక పత్రిక కూడా క్షమాపణ చెప్పిందని గుర్తుచేశారు. ముమ్మందు తనపై ఫార్ములా-ఈ రేస్, విద్యుత్ కుంభకోణం వంటి తప్పుడు ఆరోపణలు చేసిన ప్రతి ఒక్కరూ పశ్చాత్తాపంతో క్షమాపణలు చెప్పక తప్పదని ఆయన అన్నారు.కాగా, అంతకుముందు మంత్రి కొండా సురేఖ ఎక్స్ వేదికగా కేటీఆర్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పారు. అప్పటి రాజకీయ పరిస్థితుల్లో భాగంగా, ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలోనే ఆ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని, కేటీఆర్‌ను వ్యక్తిగతంగా బాధపెట్టే ఉద్దేశం తనకు లేదని ఆమె స్పష్టం చేశారు.



నేను అప్పుడు అలా మాట్లాడాల్సింది కాదు.. కేటీఆర్‌కు సారీ చెప్పిన కొండా సురేఖ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణ చెప్పిన కొండా సురేఖ

రేవంత్ రెడ్డి క్యాబినెట్ నుంచి తొలగించిన తర్వాత ఈ పరిణామం

కొండా దంపతులు తిరిగి బీఆర్ఎస్‌లో చేరతారనే ఊహాగానాలకు బలం



తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకురాలు కొండా సురేఖ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణ చెప్పారు. (మిగతా 3వ పేజీలో..

బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం.. తీరం వైపు మరో ముప్పు

అర్నబ్ తుపాను ప్రభావం నుంచి కోలుకోకముందే మరో ముప్పు

దక్షిణ అండమాన్ సముద్రంలో కొత్త అల్పపీడనం

రానున్న 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం

కొత్త హెచ్చరికతో రైతులు, తీరప్రాంత ప్రజల్లో ఆందోళన



'అర్నబ్' తుపాను సృష్టించిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరం ఇంకా కోలుకోకముందే మరో ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి రాష్ట్రం వైపు కదిలే అవకాశం ఉండటంతో తీర ప్రాంత ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన తాజా సమాచారం ప్రకారం, దక్షిణ అండమాన్ సముద్ర పరిసర ప్రాంతాల్లో ఒక అల్పపీడనం ఏర్పడింది. ఇది (మిగతా 3వ పేజీలో..)

నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి భారీ నిరసన.. వెనక్కి తగ్గేది లేదన్న ఖర్గే

రామ్‌లీలా మైదానంలో భారీ కార్యక్రమం

నిరసన వాయిదా ఉండదన్న మల్లికార్జున ఖర్గే

పండుగల సీజన్ దృష్ట్యా వాయిదా కోరిన వ్యాపార సంఘాలు

ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యమన్న రాహుల్ గాంధీ

ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయంటూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని వాయిదా వేసే ప్రసక్తే లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తమ పోరాట లక్ష్యమని పేర్కొన్నారు.ఎన్నికల సంఘం చేపడుతున్న 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓట్ల చోరీ, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈ (మిగతా 3వ పేజీలో..)



ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై చర్యలు తప్పవు: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

బిల్లుల కోసం చావడానికి కూడా సిద్ధమేనన్న అనిరుధ్ రెడ్డి

అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామన్న మహేశ్ గౌడ్

నిధుల కొరత రాష్ట్రవ్యాప్తంగా ఉందన్న పీసీసీ చీఫ్

సొంత పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా (మిగతా 3వ పేజీలో..)



రామ్‌లీలా మైదానానికి తరలిరండి.. విద్యార్థులకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి

ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఈ ఉద్యమం అని వెల్లడి

ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించిన కార్యక్రమం కాదని స్పష్టం

భయపడకుండా విద్యార్థులు తరలిరావాలని ప్రత్యేక విజ్ఞప్తి

పోలీసులకు, లాఠీలకు భయపడొద్దని యువతకు ధైర్యం చెప్పిన రాహుల్

కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ దేశ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. నవంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ రామ్‌లీలా మార్చ్'కు భారీ సంఖ్యలో (మిగతా 3వ పేజీలో..)



ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ

హైదరాబాద్, అక్టోబరు 29 రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు చేపడుతున్న కార్యక్రమాలు, నిధుల వినియోగం, అర్హులైన కుటుంబాలకు అందుతున్న ప్రయోజనాలపై చర్చించారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు

ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. వ్యవసాయం, విద్యుత్, గృహ వసతి, వైద్య సేవలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఆయా రంగాల్లో అమలవుతున్న పథకాల ద్వారా లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలపై స్పష్టమైన సమాచారం సేకరించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి, అర్హులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు.



రైతులకు అందుతున్న ప్రయోజనాలపై నివేదికలు

ఎస్సీ, ఎస్టీ రైతులకు వ్యవసాయ రంగంలో అందుతున్న ప్రభుత్వ సహాయం, ఇతర (మిగతా 3వ పేజీలో..)

(మిగతా 2వ పేజీలో..)

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ

మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. రైతులకు అందుతున్న పథకాల వివరాలను విశ్లేషించి, అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ రంగంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం సకాలంలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

1,300 ఎకరాల భూముల వినియోగంపై దృష్టి

రాష్ట్రంలో గుర్తించిన సుమారు 1,300 ఎకరాల ఖాళీ భూముల వినియోగంపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఇళ్ల స్థలాలు లేని అర్హులైన కుటుంబాలకు భూములు కేటాయించే అవకాశాలను పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. భూముల లభ్యత, అర్హులైన కుటుంబాల అవసరాలను పరిగణనలోకి తీసుకుని తగిన కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో విద్యుత్ సరఫరా, ఇతర మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి నియోజకవర్గంలో కమ్యూనిటీ హాళ్లు, శ్మశాన వాటికల అవసరాలను గుర్తించి, వాటి ఏర్పాటుకు సంబంధించిన వివరాలను సేకరించాలని ఆదేశించారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్య క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణ

గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు మొబైల్ వైద్య యూనిట్ల ఏర్పాటుపై పరిశీలన చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆరోగ్య సేవలతో పాటు విద్యుత్, గృహ వసతి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనలోనూ సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

సబ్‌ప్లాన్ నిధులపై డిజిటల్ పర్యవేక్షణ

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగం, చేపట్టిన పనుల పురోగతి, లబ్ధిదారుల వివరాలను డిజిటల్ విధానంలో పర్యవేక్షించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. నిధులు ఏ కార్యక్రమాలకు ఖర్చు చేస్తున్నారు, వాటి ద్వారా ఎంతమందికి ప్రయోజనం కలుగుతోంది అనే వివరాలు అందుబాటులో ఉండేలా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. సబ్‌ప్లాన్ నిధులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వినియోగమయ్యేలా నిరంతర సమీక్ష చేపట్టాలని తెలిపారు.

చంద్రబాబు విజ్ఞప్తికి వెంటనే స్పందించిన తెలంగాణ ప్రభుత్వం

అర్నబ్ తుపానుతో దెబ్బతిన్న ఏపీకి అండగా నిలిచిన తెలంగాణ

సీఎం చంద్రబాబు విజ్ఞప్తికి రేవంత్ సర్కార్ సానుకూల స్పందన

విద్యుత్ పునరుద్ధరణ పనులకు 500 మంది సిబ్బంది తరలింపు

తుపాను కారణంగా 16 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు ధ్వంసం

విపత్కర సమయంలో తెలుగు రాష్ట్రాల మధ్య అరుదైన స్నేహబంధం

అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. తుపాను ధాటికి దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు సహకారం అందించాలన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి పట్ల రేవంత్ రెడ్డి సర్కారు వెంటనే స్పందించింది. ఈ మేరకు ఏపీకి ప్రత్యేక బృందాలను పంపింది.అర్నబ్ తుపాను ప్రభావంతో అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం సహా పలు ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, సుమారు 16,000లకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో వందలాది గ్రామాల్లో అంధకారం నెలకొంది. ఈ నేపథ్యంలో, విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్.. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ఫోన్‌లో మాట్లాడి సహాయం కోరారు.ఏపీ సీఎం చంద్రబాబు విజ్ఞప్తిపై భట్టి విక్రమార్క వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలను ఏపీకి పంపేందుకు ఏర్పాట్లు చేశారు. టీజీఎస్పీడీసీఎల్ నేతృత్వంలోని ఈ బృందాలు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌కు బయలుదేరి, కూలిపోయిన స్తంభాలు, తెగిపడిన తీగల మరమ్మతు పనుల్లో పాల్గొంటున్నాయి. ప్రస్తుతం ఏపీలో 1,700 మంది స్థానిక సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమవ్వగా, మరో 500 మందిని ఇతర డిస్కంల నుంచి రప్పిస్తున్నారు. వీరికి తోడుగా తెలంగాణ సిబ్బంది కూడా చేరడంతో పనులు వేగవంతమయ్యాయి. వీలైనంత త్వరగా, వీలైతే 24 గంటల్లోనే విద్యుత్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావడమే లక్ష్యంగా ఇరు రాష్ట్రాల సిబ్బంది కలిసికట్టుగా పనిచేస్తున్నారు.



ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై చర్యలు తప్పవు: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

మొదటి పేజీ తరువాయి)

పరిగణిస్తున్నామని, ఈ వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీకి అప్పగిస్తామని ఆయన స్పష్టం చేశారు. అనిరుధ్ రెడ్డికి త్వరలోనే నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని సూచించారు.“జడ్చర్లలో నేను చస్తేనే బిల్లులు వస్తాయంటే... నియోజకవర్గ అభివృద్ధి కోసం చనిపోవడానికైనా సిద్ధం” అని అనిరుధ్ రెడ్డి ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సొంత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ఉన్న ఈ వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం సీరియస్ గా తీసుకుంది. ఈ వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందిస్తూ... నిధుల కొరత ఒక్క జడ్చర్లలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉందని, ఇలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఈ అంశాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు.నవంబర్ 1న ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ ర్యాలీకి కార్యకర్తలను తరలించేందుకు ప్రత్యేక రైళ్ల కోసం దరఖాస్తు చేస్తే, దక్షిణ మధ్య రైల్వే సాకులు చెప్పి తిరస్కరిస్తోందని మహేశ్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పేరు చెబితేనే బీజేపీ వణికిపోతోందని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ నుంచి కార్యకర్తలను ఢిల్లీకి తీసుకెళ్లి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నేను అప్పుడు అలా మాట్లాడాల్సింది కాదు.. కేటీఆర్‌కు సారీ చెప్పిన కొండా సురేఖ

మొదటి పేజీ తరువాయి)

గతంలో ఆయనపై చేసిన వ్యక్తిగత, నిరాధారమైన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’ వేదికగా ప్రకటించారు. ఈ పరిణామంతో ఆమె తిరిగి బీఆర్ఎస్‌లో చేరతారనే ఊహాగానాలు జోరందుకున్నాయి.అప్పట్లో ప్రతిపక్షంపై చేసిన రాజకీయ విమర్శల్లో భాగంగానే ఆ వ్యాఖ్యలు చేశానని, కేటీఆర్‌ను గానీ, ఆయన కుటుంబ సభ్యులను గానీ ఉద్దేశపూర్వకంగా కించపరిచే ఉద్దేశం తనకు లేదని సురేఖ తన పోస్టులో స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన క్యాబినెట్ నుంచి కొండా సురేఖను తొలగించిన కొన్ని రోజులకే ఈ పరిణామం జరగడం గమనార్హం. సరైన వివరణ ఇవ్వకుండా తనను మంత్రి పదవి నుంచి తొలగించడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ మహిళను కావడం వల్లే తనను తప్పించారా అని కూడా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కొండా సురేఖ, ఆమె భర్త మురళి కాంగ్రెస్‌ను వీడి తిరిగి సొంత గూటికి (బీఆర్ఎస్) చేరవచ్చని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. కేటీఆర్‌తో ఉన్న పాత విభేదాలను పరిష్కరించుకుని, పార్టీలో చేరేందుకు మార్గం సుగమం చేసుకోవడంలో భాగంగానే ఈ క్షమాపణ చెప్పారని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ పరిణామంపై బీఆర్ఎస్ నాయకత్వం నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.

నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి భారీ నిరసన.. వెనక్కి తగ్గేది లేదన్న ఖర్గే

మొదటి పేజీ తరువాయి)

నిరసనకు పిలుపునిచ్చింది. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించిన తీరుపై కూడా ఖర్గే విమర్శలు చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ, ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు తమకు మద్దతుగా ఉన్నాయని వెల్లడించారు.

వాయిదా వేయాలని వ్యాపార సంఘాల విజ్ఞప్తి

పండుగల సీజన్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తే ఢిల్లీలో వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటాయని పలు వ్యాపార సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ర్యాలీని మరో తేదీకి మార్చాలని రాహుల్ గాంధీని కోరాయి. పెద్ద ఎత్తున జనసమీకరణ వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతినడంతో పాటు తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని వ్యాపారులు పేర్కొన్నారు. అయితే ఈ విజ్ఞప్తుల నేపథ్యంలోనూ నవంబర్ 1న నిరసన కొనసాగుతుందని ఖర్గే స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే: రాహుల్ గాంధీ

మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా నిరసనలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మార్చ్ ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ఓట్ల చోరీని అడ్డుకోవడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసమని అన్నారు. రాజకీయ భేదాలకు అతీతంగా విద్యార్థి సంఘాలు కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజాస్వామ్య స్ఫూర్తి, వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కులు ముప్పును ఎదుర్కొంటున్నాయని ఆయన ఆరోపించారు.నవంబర్ 1న దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఢిల్లీకి తరలివచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అంతకుముందు రోజు, అంటే అక్టోబర్ 30న, ‘మాక్ పార్లమెంట్’ నిర్వహించనున్నట్లు ఖర్గే వెల్లడించారు.

రామ్‌లీలా మైదానానికి తరలిరండి.. విద్యార్థులకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి

మొదటి పేజీ తరువాయి)

తరలిరావాలని కోరారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దేశ ఆత్మను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఈ ఉద్యమమని, ఓట్ల దొంగతనాన్ని అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ఏ ఒక్క రాజకీయ పార్టీకి మాత్రమే పరిమితం కాదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఎన్నికల కమిషన్ వైఖరితో విభేదించే ప్రతి ఒక్కరూ, ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే పౌరులందరూ ఈ మార్చ్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.“మీ భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆలోచనలు, జీవన విధానంపై దాడి జరుగుతోందని మీరు భావిస్తే, ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ఈ మార్చ్‌కు తరలిరండి. పోలీసులకు, లాఠీలకు భయపడవద్దు. బీజేపీ ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడే సాహసం చేయదు” అని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. దేశవ్యాప్తంగా వేలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొని, దీనిని విజయవంతం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం.. తీరం వైపు మరో ముప్పు

మొదటి పేజీ తరువాయి)

రానున్న 24 గంటల్లో పశ్చిమ–వాయవ్య దిశగా పయనిస్తూ తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. ఆ తర్వాత మరో 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా కేంద్రీకృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.ఈ వాతావరణ వ్యవస్థ మరింత బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు పయనించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే ‘అర్నబ్’ తుపాను కారణంగా పంట నష్టం, ఆస్తి నష్టంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న కోస్తా జిల్లాల ప్రజలను ఈ కొత్త హెచ్చరిక మరింత ఆందోళనకు గురిచేస్తోంది. రానున్న రోజుల్లో దీని తీవ్రత, కదలికలపై మరింత స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొన్నారు.

తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కండి : సీఎం రేవంత్ రెడ్డి

అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యువ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ కంప్యూటర్, టెలికం రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు దేశ ప్రగతికి పునాది వేసిందని సీఎం కొనియాడారు. నేడు ఫోన్, ఇంటర్నెట్ లేని జీవితం ఊహించలేని పరిస్థితి ఏర్పడిందంటే అందుకు ఆనాటి సంస్కరణలే కారణమన్నారు. రాజీవ్‌గాంధీ హైదరాబాద్‌లో పైలట్ శిక్షణ పొందారని, అందుకే హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టామని సీఎం తెలిపారు. 1991లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పీవీ నరసింహారావు దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చారని సీఎం తెలిపారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ చూపారని వివరించారు. హైదరాబాద్ జీవన విధానంలోనే ప్రపంచ దృక్పథం ఉందని, సంస్కరణలు, పారిశ్రామిక అభివృద్ధి, వ్యాపార స్ఫూర్తి తెలంగాణ ప్రజల జీవన విధానంలో భాగమని రేవంత్‌రెడ్డి అన్నారు. 1991 నుంచి వివిధ రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పటికీ, హైదరాబాద్ లో పెట్టుబడులకు అన్ని ప్రభుత్వాలు తమవంతు సహకారం అందించాయని తెలిపారు.

పెట్టుబడులు రెట్టింపు చేయండి...

మీ ఎదుట సుదీర్ఘ ప్రసంగం చేయడానికి తాను రాలేదని, మీ అభిప్రాయాలు తెలుసుకోవడానికి వచ్చానని అంతర్జాయతీ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించుకున్న పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడి మొత్తాన్ని, వ్యాపార వృద్ధిని, లాభాల అంచనాలను రెట్టింపు చేయాలని కోరారు. పారిశ్రామికవేత్తలు తమ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రభుత్వం నుంచి ఏం కావాలో చెప్పాలని, విధానపరమైన మార్పుల నుంచి అవసరమైన సహకారం వరకు అన్నింటినీ అందించేందుకు వ్యక్తిగతంగా తాను బాధ్యత తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల తెలంగాణ

‘తెలంగాణ రైజింగ్--2047’ లక్ష్యం వికసిత్ భారత్-2047 దార్శనికతకు అనుగుణంగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సమయంలో దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 5 శాతం నుంచి 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం వివరించారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సీఎం ప్రకటించారు.

కేంద్రంతో కలిసి రాష్ట్రాభివృద్ధి

కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై పెట్టుబడిదారులకు సందేహాలు ఉండొచ్చని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అయితే, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా హాజరుకావడమే ఇందుకు నిదర్శనమని సీఎం తెలిపారు. దేశంలో ఏడు హైస్పీడ్ రైలు కారిడార్ల ఏర్పాటుకు కేంద్రం నిర్ణయించగా, వాటిలో హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, పుణెకు మూడు కారిడార్లు కేటాయించారని తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్‌లలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు కూడా కేంద్రం సహకరిస్తోందన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు విస్తరణ, నేవీ లో-ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కేంద్రం నుంచి సహకారం అందుతోందని సీఎం తెలిపారు. దేశాభివృద్ధి, ప్రజాసేవ విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి విషయంలో ప్రభుత్వ అతి జోక్యానికి బదులు సమర్థ పాలన అవసరమని అభిప్రాయపడ్డారు. పారిశ్రామికవేత్తలు విజయాలు సాధించే మార్గంలో ఉన్న అడ్డంకులను తొలగించడమే తన బాధ్యతని తెలిపారు. హైదరాబాద్ పోటీ ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు నగరాలతో కాదని, న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి ప్రపంచ నగరాలతోనేనని సీఎం అన్నారు. ప్రపంచస్థాయి ఆలోచనలు, మెరుగైన విధానపరమైన సూచనలను పారిశ్రామికవేత్తలు అందించాలని కోరారు. వారి సూచనలను ప్రభుత్వ విధానాల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణ ప్రగతి పథంలో ముందుకు సాగుతోందని, ఈ ప్రయాణంలో ప్రపంచ పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అంతా కలిసి ముందుకు సాగితే చరిత్ర సృష్టించగలమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీలు అభిషేక్ మను సింఘ్వీ, రేణుకా చౌదరి, డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

రాయినిగూడెంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

- **ప్రతి పేదవాడి సొంతింటి కలే లక్ష్యం.. ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేద కుటుంబాల్లో కొత్త వెలుగులు!**
- **పేదల జీవితాల్లో భరోసా నింపుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం: గుండు రామాంజిగౌడ్**

రాయినిగూడెం, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):

పేదవాడికి సొంతిల్లు కేవలం కల మాత్రమే కాదు.. అది ఆత్మగౌరవానికి ప్రతీక! ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి భరోసా కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో కొత్త ఆశలు నింపుతోంది. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాయినిగూడెం గ్రామ సర్పంచ్, సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గుండు రామాంజిగౌడ్ పాల్గొని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. సొంతింటి కల సాకారమవుతున్న తరుణంలో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వ్యక్తమైంది.ఈ సందర్భంగా గుండు రామాంజిగౌడ్ మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించడం ద్వారా వారికి భద్రతతో పాటు గౌరవప్రదమైన జీవనం అందించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేరాలన్నదే తమ ఆకాంక్ష అని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు.ఇల్లు అనేది కేవలం నాలుగు గోడల నిర్మాణం మాత్రమే కాదని, ఒక కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై నమ్మకాన్ని అందించే చిరునామా అని పేర్కొంటూ, పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చే కార్యక్రమాలు మరింత



మందికి ప్రయోజనం చేకూర్చాలని ఆకాంక్షించారు.గ్రామ కార్యదర్శి సునీత, మాజీ ఎంపీటీసీ బాలుదూరి సందీప్, గ్రామ శాఖ అధ్యక్షుడు శంభయ్య, రాష్ట్ర డీలర్ల సెక్రటరీ గుండు గురవయ్య, యువజన నాయకులు గండు నరేష్, గుండు నరసింహ, లబ్ధిదారులు గుండు స్వప్న, గుండు ఉష, దార ధనమ్మ, మేకపోతుల విజయలక్ష్మి, గుడిగుంట్ల ధనమ్మ, పోలగాని రమణ, పగిళ్ల మహేంద్ర, సురగాని నాగమ్మ, అమరారపు సువాసిని, గంట పుష్పలత, కడప అంజమ్మ, మాచర్ల భద్రమ్మ, కడప సువార్త, వాడపల్లి నాగమ్మ, ఆలేటి మల్సూరు, గ్రామ పెద్దలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ దెబ్బకు నేలకొరిగిన వరి పంటలు.. రైతులను ఆదుకోవాలి!

పంట నష్టంపై తక్షణ సర్వే చేపట్టి పరిహారం అందించాలి

ప్రభుత్వాన్ని కోరిన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు

గరిడేపల్లి, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):

ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట చేతికందే సమయంలో తుఫాన్ రూపంలో వచ్చిన ప్రకృతి వైపరీత్యం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేసిందని, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా గరిడేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలు నేలకొరిగాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో గానుగుబండ గ్రామంలో దెబ్బతిన్న వరి పొలాలను గురువారం రైతులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పోకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సాగు ప్రారంభం నుంచి రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ, అప్పులు చేసి, అధిక వడ్డీలకు పెట్టుబడులు సమకూర్చుకుని పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. సాగునీరు, విద్యుత్ సమస్యలను అధిగమిస్తూ ఎంతో శ్రమించి పండించిన పంట మరో 15 రోజుల్లో చేతికందుతుందనగా తుఫాన్ కారణంగా నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.పంటలు నేలకొరిగి దెబ్బతినడంతో పెట్టిన పెట్టుబడులు తిరిగి వస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. గరిడేపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో పంట నష్టంపై అధికారులు తక్షణమే క్షేత్రస్థాయి సర్వే నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. నష్టపోయిన పంటల వివరాలను పారదర్శకంగా



సేకరించి, అర్హులైన రైతులకు తగిన ఆర్థిక పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యతని, ఈ క్లిష్ట సమయంలో రైతులకు భరోసా కల్పించి వారి కుటుంబాలను ఆర్థికంగా నిలబెట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, రైతు సంఘం నాయకులు కట్టా నర్సింహారావు, పంగ గోవిందు, చిక్కుళ్ల సైదులు, పోకల ఆంజనేయులు, మెండే వెంకన్న, ఈద సైదులు, ఈశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు కోసం ఏఐవైఎఫ్ ప్రత్యేక కార్యక్రమం

ప్రజాస్వామ్య పరిరక్షణలో యువత ముందడుగు

అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు కావాలి: జీ. దామోదర్ రెడ్డి

మేడ్చల్, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):

పట్టభద్రుల గొంతుక శాసనమండలిలో బలంగా వినిపించాలంటే అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జీ. దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈసీఐఎల్‌లోని కమలానగర్ వద్ద ఏర్పాటు చేసిన ఓటరు నమోదు హెల్ప్‌డెస్క్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టభద్రులకు ఫారం-18 దరఖాస్తులను అందజేశారు.ఈ సందర్భంగా జీ. దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, విద్యారంగ సమస్యలు, యువత భవిష్యత్తు వంటి కీలక అంశాలపై తమ అభిప్రాయాలను ప్రజాస్వామ్య వేదికలపై వినిపించేందుకు పట్టభద్రుల ఓటు ముఖ్యమైన సాధనమని పేర్కొన్నారు.ఓటు హక్కు కేవలం రాజ్యాంగం కల్పించిన హక్కు మాత్రమే కాదని, అది సామాజిక బాధ్యత కూడా అని అన్నారు. పట్టభద్రులు ఓటరు నమోదుపై నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైన పత్రాలతో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఓటరుగా నమోదైనవారు సైతం ప్రస్తుత అధికారిక మార్గదర్శకాలను పరిశీలించి తమ నమోదు



స్థితిని నిర్ధారించుకోవాలని సూచించారు.అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదుపై అవగాహన కల్పించడం, యువతలో ప్రజాస్వామ్య చైతన్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్య ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు గిరిబాబు, శేఖర్, సతీష్, పట్టభద్రులు సుదర్శన్, అశోక్, సుధీప్, మధు, రవి, రమ్య, కీర్తన, రామారావు, బాషా, తిరుపతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కీతవారిగూడెంలో రైతులకు పురుగుల నివారణపై అవగాహన

కీతవారిగూడెం, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):

గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో కీతవారిగూడెంలో వరి పంటలో పురుగుల నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఏలూరులోని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు ఎం. నవ్యశ్రీ, వై. సౌమ్య, వై. మానిష, పి. హేమలత, ఐ. సత్యజ్యోతి లద్దె పురుగుల గుర్తింపు, నివారణ చర్యలను వివరించారు. విషపు ఎరల వినియోగం, పురుగుమందుల భద్రతపై సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ సిఫార్సులు, రసాయనాల లేబుల్‌పై సూచించిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.కార్యక్రమంలో బొల్లెపల్లి పాపయ్య, నర్సింగు వెంకటేశ్వర్లు, వెల్పుల రామలింగయ్య తదితర రైతులు పాల్గొన్నారు.



బొల్లంపల్లి రాజయ్య మృతి పట్ల భీమదేవరపల్లి ప్రెస్ క్లబ్ ప్రగాఢ సంతాపం

భీమదేవరపల్లి, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



భీమదేవరపల్లి మండల వి6 విలేఖరి బొల్లంపల్లి చరణ్ రాజ్ తండ్రి బొల్లంపల్లి రాజయ్య (63) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న భీమదేవరపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు రాజయ్య మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మాడుగుల రాజ్ కుమార్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజయ్య మృతి పట్ల ప్రెస్ క్లబ్ సభ్యులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాట్ల హరికుమార్, ప్రధాన కార్యదర్శి మాడుగుల రామకృష్ణ, ఉపాధ్యక్షులు గౌడ చంద్రబాబు, కోల రమేష్, కనకం వెంకటేష్, మేకల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూర్ సహకార సంఘాన్ని సందర్శించిన ఎస్‌బీఐఆర్‌డీ అధికారులు

భీమదేవరపల్లి, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



రైతు సంక్షేమం, సహకార రంగ అభివృద్ధి కార్యక్రమాలపై అధ్యయనం చేసేందుకు ఎస్‌బీఐఆర్‌డీ (స్టేట్ బ్యాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్), హైదరాబాద్ ఉన్నతాధికారులు ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సంఘాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి సంఘం అభివృద్ధి ప్రస్థానం, రైతులకు అందిస్తున్న సేవలు, వ్యవసాయ రుణాలు, పంటల సేకరణ, మార్కెటింగ్ విధానాలను వివరించారు. ఎస్‌బీఐఆర్‌డీ డిప్యూటీ జనరల్ మేనేజర్ అశోక్ కుమార్ ఝా, చీఫ్ మేనేజర్లు ధీరజ్ కుమార్, జి. శ్రీకాంత్ రెడ్డి సంఘం కార్యకలాపాలను పరిశీలించి, ఉత్తమ సహకార విధానాలు, భవిష్యత్ సహకార అవకాశాలపై చర్చించారు.

ప్రమాద బీమాతో బాధిత కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేత

భీమదేవరపల్లి, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మృతి చెందిన కొప్పూర్ గ్రామానికి చెందిన వల్లెపు సారమ్మ కుటుంబానికి ములుకనూరు సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సంఘం ఆధ్వర్యంలో రూ. 2 లక్షల జనతా ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఇఫ్కో టోక్యో బీమా పథకం కింద మంజూరైన చెక్కును సంఘం అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, కుటుంబ సభ్యులు వల్లెపు రాజు, వల్లెపు మహేందర్‌లకు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ పాలకవర్గ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

తొర్రూరులో శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ డా. శబరీష్

తొర్రూరు, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



అమరవీరుల దినోత్సవం సందర్భంగా తొర్రూరు డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ప్రారంభించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణ కిషోర్, సీఐలు టి. గణేష్, పవన్, సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే కోచ్ మాడుగుల ప్రవీణ్‌కు హీరో సుమన్ సత్కారం

భీమదేవరపల్లి, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముస్తాఫాపూర్ గ్రామానికి చెందిన కరాటే కోచ్ మాడుగుల ప్రవీణ్‌ను ప్రముఖ సినీ నటుడు సుమన్ హైదరాబాద్‌లో సత్కరించారు. గురువారం ప్రవీణ్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు.ఇటీవల శ్రీలంకలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో భారత జట్టు పతకాలు, ఛాంపియన్‌షిప్ కప్ సాధించడంలో ప్రవీణ్ కోచ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయనను సుమన్ అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ముస్తాఫాపూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్ కరాటే కోచ్‌గా అందిస్తున్న సేవలు, అంతర్జాతీయ పోటీల్లో భారత జట్టు సాధించిన విజయాలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

పట్టభద్రుల ఓటరు నమోదు కోసం ముందడుగు వేసిన సర్పంచ్ బొల్లెపల్లి రామనాథం!

- **కీతవారిగూడెం పట్టభద్రుల తరపున 20 దరఖాస్తుల సమర్పణ**
- **ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేలా చొరవ**

గరిడేపల్లి, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



కీతవారిగూడెం గ్రామ పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించే ప్రక్రియలో గ్రామ సర్పంచ్ బొల్లెపల్లి రామనాథం చొరవ తీసుకున్నారు. పట్టభద్రుల నూతన ఓటరు నమోదు కోసం అవసరమైన దరఖాస్తులను సిద్ధం చేయించి, గురువారం గరిడేపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించారు.గ్రామానికి చెందిన పట్టభద్రుల వివరాలతో మీ సేవ కేంద్రం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేయించి, గెజిటెడ్ అధికారి సంతకాలు పొందిన అనంతరం మొత్తం 20 దరఖాస్తులను సంబంధిత తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌కు అందజేశారు. పట్టభద్రులు తమ ప్రజాస్వామ్య హక్కైన ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.గ్రామంలోని అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించడం, అవసరమైన దరఖాస్తుల సమర్పణలో సహకరించడం వంటి చర్యలకు ఈ కార్యక్రమం దోహదపడింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొల్లెపల్లి రామనాథంతో పాటు మండల బీఆర్ఎస్ నాయకులు పోలంపల్లి ఆనంద్ బాబు, హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పిడమర్తి అంజి, గ్రామ బీఆర్ఎస్ నాయకులు కీత పరశురాం, దాసరి ఆంజనేయులు, నర్సింగ్ వెంకటేశ్వర్లు, తవిడబోయిన వెంకన్న, గోపాల దాసు హుస్సేన్, నర్సింగ్ రవి, ఎస్‌కే సైదా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురానికి గ్రామకంఠం కేటాయించాలి!

- **దశాబ్దాల భూ రికార్డుల సమస్యకు పరిష్కారం చూపాలి.. జిల్లా కలెక్టర్‌కు ఐఎన్‌టీయూసీ నేత గురవయ్య గౌడ్ విజ్ఞప్తి**

హుజూర్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామానికి తక్షణమే అధికారికంగా గ్రామకంఠం కేటాయించి, భూ రికార్డుల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి గ్రామస్తులకు న్యాయం చేయాలని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య గౌడ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. గ్రామంలోని దేవాదాయ, పట్టా, ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డులను సమగ్రంగా పరిశీలించి అవసరమైన సవరణలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి గ్రామస్తుల వినతి

గత ఏడాది గోపాలపురం గ్రామస్తులు మంత్రి కెప్టెన్ నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి గ్రామంలోని భూములపై సమగ్ర సర్వే నిర్వహించి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించినట్లు గురవయ్య గౌడ్ తెలిపారు. మంత్రి సూచనల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో, తహశీల్దార్ ఆధ్వర్యంలో డివిజన్ సర్వేయర్ గ్రామంలో సర్వే నిర్వహించినట్లు పేర్కొన్నారు.

సర్వేలో కీలక భూ వివరాల గుర్తింపు

సర్వే వివరాల ప్రకారం గోపాలపురం గ్రామం సుమారు 65 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నట్లు గుర్తించారని గురవయ్య గౌడ్ తెలిపారు. 238వ సర్వే నంబర్‌లో 1 ఎకరం 17 కుంటల పోరంబోకు పట్టా భూమి, 342వ సర్వే నంబర్‌లో 6 ఎకరాల 13 కుంటల ప్రభుత్వ భూమి, 623వ సర్వే నంబర్‌లో 36 ఎకరాల 26 కుంటల ప్రభుత్వ భూమి ఉన్నట్లు సర్వే వివరాల్లో వెల్లడైందని పేర్కొన్నారు.ఈ మూడు సర్వే నంబర్లకు సంబంధించి తహశీల్దార్, ఆర్డీవో నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలిపారు. అయితే, ఈ భూముల వర్గీకరణ, గ్రామకంఠం కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఆయన విజ్ఞప్తి చేశారు.

రికార్డుల సమస్యతో గ్రామస్తులకు ఇబ్బందులు

గ్రామం దశాబ్దాలుగా ఉనికిలో ఉన్నప్పటికీ గ్రామకంఠం, భూ రికార్డులకు సంబంధించిన సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గురవయ్య గౌడ్ పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికే నిర్వహించిన సర్వే ఆధారంగా నివేదికను పరిశీలించి, చట్టబద్ధమైన ప్రక్రియను పూర్తి చేసి గ్రామకంఠం కేటాయింపుపై తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి భూ రికార్డులను పరిశీలించాలని, అవసరమైన సవరణలు చేపట్టి గోపాలపురం గ్రామస్తులకు న్యాయం చేయాలని బెల్లంకొండ గురవయ్య గౌడ్ విజ్ఞప్తి చేశారు.

ఆసిఫాబాద్‌లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో డీడీ తనిఖీలు

ఆసిఫాబాద్, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):

జిల్లా కేంద్రంలోని బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, ఆదర్శ క్రీడా పాఠశాలను డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, పదో తరగతి వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలును సమీక్షించారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన బాలికలను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి మాడావి శేఖు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించరా?

- **కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలి.. గ్యాస్ సరఫరా చేయాలి**
- **కార్మికుల సమస్యలను పరిష్కరించాలి: సీఐటీయూ నాయకుడు ఎస్.కె. యాకూబ్**

గరిడేపల్లి, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):

విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు శ్రమిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు ఎస్.కె. యాకూబ్ డిమాండ్ చేశారు. గురువారం గరిడేపల్లి మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్న కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు కేవలం రూ.2,000 గౌరవ వేతనంతో పనిచేస్తూ కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నప్పటికీ, అతి తక్కువ వేతనంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు.గరిడేపల్లి మోడల్ స్కూల్‌లో కనీసం వంటగది సౌకర్యం కూడా లేకపోవడంతో చెట్ల కిందే వంట చేయాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. గ్యాస్ బిల్లులు సకాలంలో అందకపోవడం వల్ల గ్యాస్ వినియోగంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వర్షం పడినప్పుడు కట్టెలతో వంట చేయడం కూడా కష్టమవుతోందని తెలిపారు. వంటకు అవసరమైన సదుపాయాలు లేకపోవడం వల్ల మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.విద్యార్థుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలు, వారికి భోజనం తయారు చేస్తున్న కార్మికుల సమస్యలను కూడా గుర్తించాలని యాకూబ్ కోరారు. కిరాణా దుకాణాల్లో అప్పులు చేసి కూరగాయలు, పప్పులు, గుడ్లు కొనుగోలు చేస్తున్న ఏజెన్సీల నిర్వాహకులు బిల్లులు వచ్చిన తర్వాత వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని వివరించారు. ఈ పరిస్థితి వల్ల కార్మికులు ఆర్థికంగా మరింత కుంగిపోతున్నారని తెలిపారు.

సీఐటీయూ ప్రధాన డిమాండ్లు:

మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు కనీసం రూ.18,000 వేతనం చెల్లించాలి.

వంట ఏజెన్సీలకు ప్రతినెలా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలి.

పాఠశాలల్లో వంటగది, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలి.

కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి.

మధ్యాహ్న భోజన కార్మికులకు యూనిఫాంలు అందించాలి.

పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించి ఏజెన్సీలపై అప్పుల భారం తగ్గించాలి.


ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వారికి న్యాయమైన వేతనాలు, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఎస్.కె. యాకూబ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు లక్ష్మీ దేవమ్మ, మణెమ్మ, నాగమ్మ, జానకమ్మ, వరమ్మ, కె. అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తకొండ వీరభద్రస్వామి జాతర హక్కులకు నవంబర్ 6న బహిరంగ వేలం

- **వివిధ వ్యాపార, సేవా హక్కులకు కనీస ధరల ఖరారు.. ఉదయం 11 గంటలకు టెండర్ ప్రక్రియ**

భీమదేవరపల్లి, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో 2027 జాతర ఏర్పాట్లకు సంబంధించి వివిధ హక్కుల కేటాయింపునకు నవంబర్ 6న టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవస్థానం ఈఓ కిషన్ రావు వివరాలు వెల్లడించారు.దేవస్థానం ప్రాంగణంలో నవంబర్ 6వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం ప్రక్రియ ప్రారంభం కానుంది. జాతర సందర్భంగా భక్తులకు అవసరమైన పూజా సామగ్రి, కొబ్బరికాయలు, ఇతర వస్తువుల విక్రయాలతో పాటు పార్కింగ్, తలనీలాల సేకరణ, విద్యుత్ దీపాలంకరణ తదితర హక్కులను వేలం ద్వారా కేటాయించనున్నారు.

రూ.3 లక్షల నుంచి కనీస ధరలు

వేలంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయ హక్కుకు రూ.3 లక్షలు, గుమ్మడికాయలు, కోరమీసాల విక్రయ హక్కుకు రూ.3 లక్షలు కనీస ధరగా నిర్ణయించారు. ఎండుకొబ్బరి ముక్కలు, బియ్యం, కండువాలు, బట్టలు, చీరెల సేకరణ విక్రయ హక్కుకు రూ.2 లక్షలు, పచ్చి కొబ్బరి ముక్కల సేకరణ హక్కుకు రూ.2 లక్షల కనీస ధరను ఖరారు చేశారు.ఇతర హక్కుల విషయానికి వస్తే.. పార్కింగ్‌కు రూ.50 వేలు, పుట్నాలు--ప్యాలాల విక్రయానికి రూ.10 వేలు, తలనీలాల సేకరణకు రూ.5 వేలు నిర్ణయించారు. విద్యుత్ దీపాలంకరణ, తడకలు--పందిర్లు వేయడం, రంగులు--సున్నాలు వేయడం, వంటపాత్రలు--టెంటు సామగ్రి హక్కులకు ఒక్కొక్కటికి రూ.10 వేల కనీస ధరగా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

టెండర్ కమ్ బహిరంగ వేలంలో పాల్గొనేవారు దేవస్థానం నిర్దేశించిన నిబంధనలు, షరతులను తప్పనిసరిగా పాటించాలని ఈఓ కిషన్ రావు సూచించారు. ఆసక్తి గల వ్యక్తులు నవంబర్ 6న ఉదయం 11 గంటలకు కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానానికి చేరుకుని వేలంలో పాల్గొనాలని తెలిపారు.జాతర సందర్భంగా భక్తులకు అవసరమైన సేవలు సజావుగా అందించేందుకు, దేవస్థానానికి సంబంధించిన హక్కుల కేటాయింపును పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ వేలం ప్రక్రియ చేపడుతున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

అటవీ భూముల పరిరక్షణకు చర్యలు

ఆసిఫాబాద్ (ప్రజానేస్తం జ్వాల):



జిల్లాలో అటవీ భూముల పరిరక్షణ, అడవుల విస్తీర్ణం పెంపునకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి బాలమణి తెలిపారు. జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో అటవీ డివిజన్ అధికారి అప్పయ్యతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.జిల్లాలో 33 వేల హెక్టార్లకు అటవీ హక్కు పత్రాలు అందించగా, మరో 38 వేల హెక్టార్లలో పోడు సాగు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. గత కొన్ని సంవత్సరాల్లో సుమారు 2,000 హెక్టార్ల భూమిలో అటవీ పెంపకానికి చర్యలు చేపట్టినట్లు వివరించారు.అటవీ ప్రాంతాల్లో విద్యుత్ వైర్ల వల్ల వన్యప్రాణులు, మనుషుల మరణాలను నివారించేందుకు విద్యుత్ శాఖతో సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. అడవుల పెంపకానికి ప్రజలు సహకరించాలని కోరారు.

గ్రూప్--3 రోస్టర్ విధానాన్ని పునఃపరిశీలించాలి: రాకేష్ ఎనమాల

తొర్రూరు, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):

ఎస్సీ వర్గీకరణలో భాగంగా గ్రూప్--3 ఉద్యోగ నియామకాల రోస్టర్ విధానంలో మాల సామాజిక వర్గానికి న్యాయం చేయాలని మాల మహానాడు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు రాకేష్ ఎనమాల కోరారు. తొర్రూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాల, మాల ఉపకులాల జనాభాపై సమగ్ర సర్వే నిర్వహించి, జీవో నంబర్ 99 నిబంధనలను పునఃపరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ అంశంపై ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు.సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శులు దాసరి ప్రకాష్, గుర్రాల లింగయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌కు రేపు 'గిరిజన గళం--తండా నిద్ర' యాత్ర

హుజూర్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



గిరిజన హక్కుల సాధన, చేవెళ్ల గిరిజన డిక్లరేషన్ అమలు తదితర డిమాండ్లతో భద్రాచలం నుంచి అక్టోబర్ 28న ప్రారంభమైన 'గిరిజన గళం--తండా నిద్ర' యాత్ర అక్టోబర్ 30న హుజూర్‌నగర్‌కు చేరుకోనుంది. ఈ యాత్రకు గిరిజనులు సహకరించి, కార్యక్రమంలో పాల్గొనాలని గిరిజన హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది నగేష్ రాథోడ్ కోరారు.గురువారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో నగేష్ రాథోడ్, లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ కన్వీనర్ వెంకట్రామ్ నాయక్ మాట్లాడుతూ చేవెళ్ల గిరిజన డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, మైదాన ప్రాంత గిరిజనులకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించడం, తండాల అభివృద్ధికి చర్యలు చేపట్టడం ఈ యాత్ర ప్రధాన లక్ష్యాలని తెలిపారు.డిక్లరేషన్ అమలులో ప్రభుత్వం జాప్యం చేస్తోందని వారు విమర్శించారు. గిరిజనుల హక్కులు, సమస్యలపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన ఈ యాత్రలో గిరిజన నాయకులు, మేధావులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీటెక్ సైదా నాయక్, వెంకటేశ్వర్లు నాయక్, నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి మద్దతు

కొమురం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను కలిసిన ఆమె వారికి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆమె పేర్కొన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలందించడంలో ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది పాత్ర ఉందని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

బాలల స్నేహపూర్వక జిల్లాగా సూర్యాపేట..

యూనిసెఫ్‌తో జిల్లా యంత్రాంగం ఒప్పందం





బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ

క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ.. పిల్లల సమస్యల పరిష్కారంపై కలెక్టర్ దిశానిర్దేశం

సూర్యాపేట, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):

పిల్లల హక్కులను పరిరక్షిస్తూ, వారి స్వేచ్ఛ, అభిరుచులు, ఆలోచనలకు ప్రాధాన్యతనిచ్చేలా సూర్యాపేట జిల్లాను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ లక్ష్య సాధనలో భాగంగా యూనిసెఫ్‌తో జిల్లా యంత్రాంగం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది.

బాలల హక్కులు, మానసిక వికాసంపై ప్రత్యేక శిక్షణ


బాలల హక్కుల పరిరక్షణ, వారి మానసిక వికాసం, అభిరుచులు, ఆలోచనా విధానం, సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు అధికారులు, విద్యాశాఖ క్లస్టర్, గ్రామస్థాయి రిసోర్స్ పర్సన్లు, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లకు బాలల అవసరాలపై అవగాహన కల్పించారు.

పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి: కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి అధికారి బాలల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పిల్లలు తమ హక్కులను, స్వేచ్ఛను పూర్తిస్థాయిలో అనుభవించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వారిలోని నైపుణ్యాలు, అభిరుచులను గుర్తించి, తమ ప్రతిభను స్వేచ్ఛగా ప్రదర్శించేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.బాలల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. యూనిసెఫ్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమం సూర్యాపేట జిల్లాను ఆదర్శ బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధి ఫిలిప్స్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా రెవెన్యూ అధికారి రాంబాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనుష, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి. రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉపేంద్ర, వివిధ ప్రాజెక్టుల సీడీపీవోలు, సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో మున్సిపల్ భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై కొరడా!





ముగ్గురు అధికారులపై క్రమశిక్షణా చర్యలకు కలెక్టర్ ఆదేశాలు

క్రిమినల్ ఫిర్యాదుకు ఆదేశం.. అవుట్‌సోర్స్ డేటా ఎంట్రీ ఆపరేటర్ తొలగింపు

సూర్యాపేట, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):

హుజూర్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన భూమిని ప్రైవేట్ వ్యక్తుల పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కీలక చర్యలకు ఆదేశించారు. మున్సిపల్ ఆస్తి పన్ను రికార్డులను అక్రమంగా సృష్టించి, వాటి ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో సంబంధిత అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో పాటు, క్రిమినల్ ఫిర్యాదు నమోదు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు.హుజూర్‌నగర్‌లో సుమారు 192 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న మున్సిపల్ బావి, దాని పక్కన ఉన్న భూమికి సంబంధించి ఈ వివాదం తలెత్తింది. ఈ స్థలానికి అక్రమంగా మున్సిపల్ ఆస్తి పన్ను మదింపు సృష్టించి, ప్రైవేట్ వ్యక్తుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేసేందుకు ఉపయోగించినట్లు ఆరోపణలు వచ్చాయి. హుజూర్‌నగర్ ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ సమర్పించిన నివేదికలను పరిశీలించిన కలెక్టర్ చర్యలకు ఆదేశించారు.

ముగ్గురు అధికారులపై క్రమశిక్షణా చర్యలు

ఆస్తి రికార్డుల సృష్టి, ధ్రువీకరణ, ప్రాసెసింగ్‌లో పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గతంలో పనిచేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ రెవెన్యూ ఆఫీసర్/రెవెన్యూ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్‌పై నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం వారు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వ్యవహారంలో సంబంధిత అవుట్‌సోర్స్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఇప్పటికే తొలగించినట్లు అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

వివాదాస్పద స్థలాన్ని పరిరక్షించాలి

వివాదంలో ఉన్న స్థలాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. భూమి యాజమాన్యం, విస్తీర్ణం, హద్దులను నిర్ధారించి, సంబంధిత రికార్డులను చట్టప్రకారం సరిచేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అనుసరించిన విధానంపై సంబంధిత సబ్ రిజిస్ట్రార్ నుంచి నివేదిక కోరాలని ఆదేశించారు.

క్రిమినల్ ఫిర్యాదుతో సమగ్ర విచారణ

మున్సిపల్ ఆస్తి రికార్డులను మోసపూరితంగా సృష్టించడం, దుర్వినియోగం చేయడం, అక్రమ లావాదేవీల్లో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులపై క్రిమినల్ ఫిర్యాదు చేయాలని కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారంలో బాధ్యుల పాత్రపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని స్పష్టం చేశారు.

జిల్లావ్యాప్తంగా ఇతర ఆస్తులపైనా ఆరా

ఈ ఘటనతోనే విచారణను పరిమితం చేయకుండా, జిల్లాలోని ఇతర మున్సిపల్ భూములు, బావులు, రహదారులు, ప్రజా స్థలాలు, ఇతర ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి ఇలాంటి అక్రమాలు జరిగాయా అనే అంశాన్ని పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. సూర్యాపేట అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు/రెవెన్యూ) ఆధ్వర్యంలో సమగ్ర విచారణ చేపట్టి, సంబంధిత అధికారులు, ప్రైవేట్ వ్యక్తుల పాత్రపై 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని సూచించారు.ప్రభుత్వ, మున్సిపల్ ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తామని, విచారణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేసినట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

ఆసిఫాబాద్‌లో రహదారి భద్రతపై సమీక్ష

ఆసిఫాబాద్ (ప్రజానేస్తం జ్వాల):

జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆసిఫాబాద్‌లో నిర్వహించిన రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని, రహదారులపై గుంతలను పూడ్చాలని సూచించారు.వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ గత నెల రోజుల్లో జిల్లాలో జరిగిన రహదారి ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందినట్లు వెల్లడించారు.



ఖిలా వరంగల్ తూర్పుకోటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



ఖిలా వరంగల్ (ప్రజానేస్తం జ్వాల):

ఖిలా వరంగల్ తూర్పుకోట ప్రాంతంలోని రేషన్ షాపుల వద్ద గురువారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.37వ డివిజన్ పరిధిలో రెవెన్యూ అధికారి నరసింహ స్వామి, మున్సిపల్ వార్డు అధికారి రవి, రేషన్ డీలర్ రాజబోయిన కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్ లబ్ధిదారులకు కార్డులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజమల్లు, సాంబమూర్తి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ పాఠశాలలో విద్యార్థులకు షీ టీమ్ అవగాహన

ఆసిఫాబాద్ (ప్రజానేస్తం జ్వాల):



ఆసిఫాబాద్‌లోని ఏపీజే అబ్దుల్ కలాం పాఠశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి జి. అనూష న్యాయ సహాయ సేవల గురించి వివరించారు. గుర్తుతెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, ఆన్‌లైన్ వేధింపులకు గురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సహాయం కోసం షీ టీమ్ నంబర్ 8712670564ను సంప్రదించాలని తెలిపారు.

తొర్రూరు కాంగ్రెస్ మండల, పట్టణ కమిటీల ప్రకటన



తొర్రూరు (ప్రజానేస్తం జ్వాల):

తొర్రూరు మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీలను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ప్రకటించారు. పాలకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కమిటీ సభ్యులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు.

వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి: అదనపు కలెక్టర్

హనుమకొండ, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



జిల్లాలో వరి కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో కొనుగోలు కేంద్రాల్లో తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు సిద్ధం చేయాలని సూచించారు. రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

చింతగట్టులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి.. ఆరుగురి అరెస్ట్

హనుమకొండ, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):

చింతగట్టు శివారులో పేకాట స్థావరంపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.24,540 నగదు, ఆరు స్మార్ట్‌ఫోన్లు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ కోసం కేయూ పోలీసులకు అప్పగించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

నంబర్ ప్లేట్లు లేని 26 బైక్‌లు సీజ్

హనుమకొండ, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 26 ద్విచక్ర వాహనాలను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై కేసులు నమోదు చేశారు. నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ హెచ్చరించారు. వాహనాలకు స్పష్టంగా కనిపించే నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని సూచించారు. తనిఖీల్లో ట్రాఫిక్ సీఐలు ప్రవీణ్ కుమార్, వెంకన్న, సుజాత పాల్గొన్నారు.

హనుమకొండలో అగ్రిస్టాక్ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు

హనుమకొండ, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



రైతులకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించేందుకు హనుమకొండ జిల్లాలో అగ్రిస్టాక్ టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో వ్యవసాయ, భూ సర్వే, పశు సంవర్ధక, ఉద్యానవన, సహకార శాఖల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. వ్యవసాయం, బ్యాంకు రుణాలు, మార్కెటింగ్, ధాన్యం కొనుగోళ్లను డిజిటల్ విధానంలో అనుసంధానించి, అర్హులైన రైతులకు పథకాలు అందేలా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

కేయూ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 40 మందికి ఉద్యోగాలు

హనుమకొండ, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



కాకతీయ యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 40 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మొత్తం 90 మంది విద్యార్థులు పాల్గొనగా, డిజిటెడ్ హైదరాబాద్ సంస్థ రాతపరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసింది.ఎంపికైన వారికి ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ చిర్ర రాజు గౌడ్ నియామక పత్రాలు అందజేశారు. విద్యార్థులకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బైలా సవరణకు ఐదుగురితో కమిటీ

హనుమకొండ, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బైలాలో మార్పులు, చేర్పుల కోసం మదన్ మోహన్ కన్వీనర్‌గా ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్లా అమర్ తెలిపారు. సభ్యత్వ అర్హతలు, ఎన్నికలు, పరిపాలన అంశాలపై సీనియర్ జర్నలిస్టులతో చర్చించి కమిటీ నివేదిక సమర్పిస్తుందని పేర్కొన్నారు. అనంతరం జనరల్ బాడీ ఆమోదంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడతామని వెల్లడించారు.

నిబంధనల మేరకు నిర్మించిన భవనాలకే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు

హనుమకొండ, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



టౌన్ ప్లానింగ్ నిబంధనల ప్రకారం నిర్మించిన భవనాలకే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేస్తామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న స్పష్టం చేశారు. హనుమకొండలోని విద్యుత్‌నగర్, నక్కలగుట్ట, సిద్ధార్థనగర్, గోపాల్‌పూర్, వడ్డేపల్లి, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో భవన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళా, బాలల కేసుల దర్యాప్తులో జాప్యం వద్దు: ఎస్పీ నరసింహ

సూర్యాపేట (ప్రజానేస్తం జ్వాల):



మహిళలు, బాలలపై నేరాల కేసుల్లో వేగంగా స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ కె. నరసింహ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో భరోసా టీమ్, షీ టీమ్స్, డీసీఆర్బీ మహిళా విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు.మహిళా సంబంధిత కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత సమయంలో చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. బాధితులకు పోలీసు, వైద్య, న్యాయ సేవలతోపాటు ప్రభుత్వ పునరావాస సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.సూర్యాపేట, కోదాడలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెల్స్ ఏర్పాటు చేయాలని, షీ టీమ్ కార్యాలయం పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదులో 50 శాతం పెరుగుదల

- **అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి.. ఓటు హక్కును వినియోగించుకోవాలి: రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి**

సూర్యాపేట, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల న్యూస్):



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 50 శాతం పెరుగుదల నమోదైందని రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి తెలిపారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని, ఎన్నికల సమయంలో తన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.సూర్యాపేట పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రాన్ని గౌరవ అతిథి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించి, సేవల వివరాలను తెలుసుకున్నారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఓటరు నమోదు 50 శాతం పెరగడం సంతోషకరమైన పరిణామమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకోవడమే కాకుండా ఎన్నికల సమయంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టభద్రుల్లో ఓటరు నమోదుపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఉచిత సేవలందిస్తున్న సిబ్బందికి అభినందనలు

ఓటరు నమోదు కేంద్రంలో ఉచితంగా సేవలందిస్తున్న వల్లెం శేఖర్, దంతాల సాయి నవీన్, పాలవరపు సంతోష్, చిక్కుళ్ల ఉపేందర్‌తో పాటు సంబంధిత సిబ్బందిని రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి అభినందించారు. పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియలో సహకరిస్తూ సేవలందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

జనగామ ఎంఈఓ కార్యాలయంలో ఆర్టీఐ సమాచార బోర్డు ఏదీ?

జనగామ, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



జనగామ మండల విద్యాధికారి (ఎంఈఓ) కార్యాలయంలో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన వివరాల బోర్డు స్పష్టంగా అందుబాటులో లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో సమాచారం కోసం వచ్చే ప్రజలు, ఉపాధ్యాయులు సంబంధిత అధికారులను గుర్తించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది.సమాచార హక్కు చట్టం--2005లోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలు ప్రజా సమాచార అధికారి, అప్పిలేట్ అధికారి వివరాలు సహా కీలక సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఈ నేపథ్యంలో ఎంఈఓ కార్యాలయంలో సంబంధిత వివరాలను స్పష్టంగా ప్రదర్శించి, చట్ట నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జాతీయ సదస్సుకు కేయూ అధ్యాపకుడు డా. సంకినేని పరిశోధనా పత్రం ఎంపిక

హనుమకొండ, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



హైదరాబాద్‌లో అక్టోబర్ 30, 31 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సదస్సుకు కాకతీయ విశ్వవిద్యాలయ రాజనీతి శాస్త్ర సీనియర్ అధ్యాపకుడు డా. సంకినేని వెంకటయ్య పరిశోధనా పత్రం ఎంపికైంది. ‘ఆర్థిక వృద్ధి, సుస్థిర అభివృద్ధి, ప్రజా విధానం’ ప్రధానాంశంగా జరిగే సదస్సులో ఆయన ‘గ్రామీణాభివృద్ధి, స్థానిక స్వపరిపాలన’ అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించనున్నారు. ప్రస్తుతం ఆయన కేయూ ఉమెన్స్ పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. పరిశోధనా పత్రం ఎంపిక కావడంపై వర్సిటీ వర్గాలు అభినందనలు తెలిపాయి.

హుజూర్‌నగర్‌లో ‘చల్తా హై’ ట్రాఫిక్‌నా..?

- **పాట్టి శ్రీరాములు సెంటర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలు.. రోడ్డుపైనే వ్యాపారాలు!**
- **రెండు ప్రమాదాలు జరిగినా మారని పరిస్థితి.. ట్రాఫిక్ నియంత్రణపై అధికారుల నిర్లక్ష్యమా?**

హుజూర్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



అంతా మా ఇష్టం.. మమ్మల్ని అడిగేదెవరు? అన్నట్లుగా హుజూర్‌నగర్ పట్టణంలోని పాట్టి శ్రీరాములు సెంటర్‌లో ట్రాఫిక్ పరిస్థితి తయారైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం వాహనాలు, ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు, రోడ్డుపై వ్యాపారాల నిర్వహణతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జనం రద్దీ.. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు

పాట్టి శ్రీరాములు సెంటర్ పరిసరాల్లో బస్టాండ్, ఆటో స్టాండ్, ద్విచక్ర వాహనాల రాకపోకలతో పాటు పోస్టాఫీసు, గ్రంథాలయం ఉండటంతో రోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి రద్దీ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి, నేరుగా రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాదచారులు రోడ్డుపైకి రావాల్సి వస్తోందని, వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

రెండు ప్రమాదాలు జరిగినా చర్యలేవీ?

ఈ ప్రాంతంలో రెండు ప్రమాదాలు జరిగినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాతైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉందని అభిప్రాయపడుతున్నారు. రద్దీగా ఉండే ప్రాంతంలో ఆక్రమణలను తొలగించి, పాదచారులకు సురక్షితమైన మార్గం కల్పించడంతో పాటు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

నియంత్రణ.. ఇప్పుడు?

గతంలో ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగితే ఒక హారన్‌తోనే రద్దీని నియంత్రించే పరిస్థితి ఉండేదని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం మాత్రం ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నా నియంత్రణ చర్యలు కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో మాదిరిగా ట్రాఫిక్ నియంత్రణలో క్రమశిక్షణ ఎందుకు కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అధికారులు స్పందించేది ఎప్పుడు?

పాట్టి శ్రీరాములు సెంటర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవడంతో పాటు రోడ్డుపై వ్యాపారాల నిర్వహణను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజల భద్రతకు, రద్దీ ప్రాంతంలో సజావుగా రాకపోకలు సాగించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

కేయూ ఆర్ట్స్ కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు



హనుమకొండ, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):

కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పీజీ కోర్సుల స్పాట్ అడ్మిషన్లకు నవంబర్ 3 వరకు గడువు ఉందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. ఎంఏ హిందీ, ఎంహెచ్ఆర్ఎం, ఎంకాం, ఎంఎస్సీ వృక్షశాస్త్రం, రసాయనశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ తదితర కోర్సుల్లో 154 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సీపీగెట్ పరీక్ష రాసినవారు, రాయని అర్హులైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలను సంప్రదించాలని సూచించారు.

నిట్ వరంగల్‌లో నేటి నుంచి ‘టెక్నోజియన్--26’

హనుమకొండ, అక్టోబర్ 29 (ప్రజానేస్తం జ్వాల):



నిట్ వరంగల్‌లో అక్టోబర్ 30, 31 తేదీల్లో వార్షిక సాంకేతిక ఉత్సవం ‘టెక్నోజియన్--26’ నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభోత్సవం జరగనుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో 50కి పైగా సాంకేతిక పోటీలు, రోబోటిక్స్ ఛాలెంజ్‌లు, స్టార్టప్ ఆలోచనల ప్రదర్శనలు, సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్‌లు నిర్వహించనున్నారు. దేశంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు, యువ ఆవిష్కర్తలు పాల్గొననున్నారు.